## ధన దాహంతో తనవాళ్లను మరచిన అతనికి గుణపాఠం?

# మినిక కథ

## సమస్య

''రేఖా! రేఖా!''

''ఆ.... ఆ... వస్తున్నా ఏమిటండి?''

''శికో గుడ్ న్యూస్. ఏమిటో చెప్పుకో చూద్దాం''

''ఏమై ఉంటుందబ్బా! నాకుగాని ఉద్యోగం వచ్చిందా! వచ్చిన ఆర్డర్స్ ఇంటికి రావాలిగా''

''అదికాదోయ్, ఇంక నీవు ఆర్డర్స్ కోసం ఎదురుచూడాల్సిన పనిలేదు.''

''అయితే తెలిసిపోయింది, మీకు లాటరీ తగిలి ఉంటుంది.''

''లాటరీ లాంటిదే అనుకో. నీకు నాటకాల సంగతి తెలియదు. పెద్దగా ఇంట్రస్టు లేక నీవు వాటిని చూడడానికి రావుగాని, ఈ రోజు నా నటన అదిరిపోయిదని అందరూ ఏక కంఠంతో అరిచారు.''

''అదే నా శుభవార్త?''

''ఉందుమరి. అనుకోకుండా నాటకాన్ని ఒక ప్రొడ్యూసరు చూడడం జరిగింది. నన్ను సినిమాల్లో బుక్ చేసుకుంటానన్నారు.''

''అయ్యో అదా సంగతి.''

''అదేం? అలా నీరుగారిపోయావు. ఎగిరి గంతేస్తావనుకున్నాను.''

''ఊ. చాల్లేండి. నాటకాల వంకన ఇప్పటికే ఇల్లు సరిగా చేరడంలేదు. ఇంక సినిమాల్లోకి వెళితే...''

''రేఖా, నీకు సంతోషంగా లేదూ. మనకిక ఎకనమికల్ ప్రొబ్లమ్స్ ఉండవు.''

''అవి ఉండవుగాని, మిగిలినవి చాలా ఉంటాయి.''

* * *



"రేఖా. నేను మద్రాసు వెళుతున్నాను. పదిరోజుల్లో వచ్చేస్తాను."

"మీకు ఈ సినిమాలు ఎందుకండీ? ఉన్న ఊరిలో ఇద్దరం ఉద్యోగం చేసికుంటే హాయిగా బ్రతకలేమా?"

"అదే వద్దంది. సిరి వచ్చి తలుపు తడితే. తలుపులు బిడాయించుకొని కూర్చో మంటావా? దేవుని దయవలన సినీఫీల్డులో

నిలదొక్కుకోగలిగితే ఇంక చూడు మన జీవితం మూడుపువ్వులు ఆరుకాయలు.

"నాకంట్లో మీ కోసం కాయలు కాస్తా."

"ఎందుకు? అందరం మద్రాసు మకాం మార్చేస్తాముగా"

* * *

"ప్లీజ్ రేఖా, నేను చెప్పేది విను అర్థం చేసుకో"

"ఏమి అర్థం చేసుకోవాలండీ! మీపేరు మార్చుకున్నారు. నాకు అభ్యంతరంలేదు. కానీ, మీకు ఇంకా పెళ్ళికాలేదని, పెళ్ళిఅయిందని తెలిస్తే హీరో ఇమేజ్ దెబ్బతింటుందని ఎవరో సలహా ఇచ్చారని అబద్ధం ఆడతారా, మీకు మనసెలా ఒప్పిందండి?"

"ఒప్పలేదనుకో. నా అర్ధాంగివి నీవే అర్థం చేసుకోకపోతే నన్ను ఇంక ఎవరు అర్థం చేసుకుంటారు చెప్పు? పైకి వెళ్ళాలంటే మరి ఇలాంటివి తప్పవు. నా జీవితాశయం నెరవేరే సమయంలో నీవు అడ్డుపడతావా? రేఖా, మరలా ఇలాంటి అవకాశం మనకు వస్తుందంటావా? కొన్ని సినిమాల్లో నటించి, పేరు తెచ్చుకున్న తరువాత అప్పుడు మెల్లగా నిన్ను అందరికీ పరిచయం చేస్తానులే. ఈలోపుగా పిల్లల్ని ఊటిలో చేర్పుదాం."

"బాబోయ్ వాళ్ళులేక. మీరూ సరిగ్గా రాక నేను ఉండలేనండి."

"మీ అమ్మ తోడుందిగా"

"నాకు కావలసింది అమ్మ కాదండి. నా పిల్లలకు అమ్మగా నేను తోడుండడం.

"నా బంగారు తల్లివికదూ! పరిస్థితులు అర్థం చేసుకోడానికి ప్రయత్నించు. పిల్లలు నీ దగ్గర ఉంటే మన విషయం తెలిసిపోతుంది. నిన్ను మద్రాసు తీసుకెళతానుగాని, నా భార్యగా చెప్పను."

"ఎంత ఖర్మ వచ్చిందండి?"

"ఆ ఖర్మే మన పాలిట కల్పవృక్షం."

* * *

"ఏమండి, మీరు ఏక్ట్ చేస్తున్న షూటింగ్ చూడాలని ఉందండి"

షూటింగ్‌కి వస్తావా? గాని ఒక అభిమానిలా, మనకు ముందు పరిచయం లేనట్లు రావాలి"

"మీ భార్యనై ఉండి, మీ పిల్లలకు తల్లినై ఉండి అనామకురాలిగా రావా?"

ప్రతీదానికి అలా అర్థాలు తీయకు. ఈ రెండు సంవత్సరాలలో ఎంత పేరు, డబ్బు వచ్చిందో చూడు. అసలు ఇలాంటి జీవితం కలగన్నారూ"

"అవును ఇలాంటి ఎడబాటు జీవితం కలగనలేదు. ఇద్దరం హాయిగా కలిసి ఉందామనుకున్నాం. షూటింగుల వంకన మీరు రోజులతరబడి వేరే ఊరిలో ఉంటారు. పెళ్ళాం, పిల్లలు అక్కరలేదు. అభిమానులకు, సినీఫీల్డ్‌కి మీరొక హీరో. నా జీవితానికి మాత్రం జీరో. సినిమాల్లో హీరోయిన్‌కి రక్షణ కల్పిస్తారు. విలన్లను, హీరోయిన్ జోలికి వస్తే చితకబాదుతారు. ఇక్కడ నేను వంటరిగా ఏ నిమిషం ఎలా ఉంటుందోనని బిక్కుబిక్కుమంటూ, మా అమ్మను తోడుగా పెట్టుకొని ఉండాలి. ఏదైనా ప్రమాదం

జరిగితే ఆమె మాౖతం ఏం చేయగలదు? మగదక్షత లేని వాళ్ళం అయ్యాము. సినిమాల్లో హీరోయిన్‌ని క్షణం విడిచి ఉండలేని మీరు, నాతో క్షణం గడపలేకపోతున్నారు. నేను గడపదాటి రాలేకపోతున్నాను.''

''అయామ్‌సారీ రేఖా. బయటతిరిగే మగవాడికి, పైగా ఉన్నత శిఖరాలు ఎక్కేవారికి బోల్డు సమస్యలు ఉంటాయి. మరి భార్యలే అర్థం చేసుకోవాలి.''

* * *

''ఏమండీ, ఈ పేపరులో వార్తలు చూసారా?''

''ఏమిటవి?''

''మీరు నాదగ్గరకు అప్పుడప్పుడు వస్తుంటే మన ఇద్దరికీ అక్రమ సంబంధం అంటగట్టారు. ఎంతటి దుస్థితి వచ్చిందండి

కట్టుకున్న పెళ్ళాంతో తాళి కట్టిన మొగుడికి అక్రమ సంబంధం అంటగట్టించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. భగవంతుడా!''

''వాళ్ళు అలాగే రాస్తారు లెద్దూ?''

''మీకు ఇది అషామాషీగా ఉందా? నేనూ రేపటినుండి మీ చుట్టంలాగే షూటింగులకు వచ్చేస్తాను''

''అది అందరూ చూడడానికి బాగుండదు. పైగా నీవు ఎదురుగా వుంటే నేను సరిగా ఏక్షన్ చేయలేను. హీరోపోర్షన్ నుండి విలన్‌కి దిగిరావాలి.''

''ఇప్పుడు మీరు విలన్ కాదేమిటి? సినిమాకు కాదులెండి. పెళ్ళానికి విలనే. అబ్బ చూడండి ఈ ఫోటోలు ఎంత దరిద్రంగా ఉన్నాయో. చూస్తేనే అసహ్యం వేస్తుంది. మిమ్మల్ని మరో ఆడది ముద్దుపెట్టుకుంటుంటే, కౌగలించుకుంటుంటే ఆ సీన్‌లు చూస్తుంటే ఉరేసుకోవాలనిపిస్తోంది.''

''తప్పు. మరో ఆడది నన్ను ముద్దుపెట్టుకోలేదు, కౌగలించుకోలేదు''

''మరి ఈ ఫోటోలు?''



''నేనే ఆవిణ్ణి ముద్దుపెట్టుకొని కౌగలించుకున్నాను'' నవ్వుతూ అన్నాడు.

''మీకు నవ్వు ఎలా వస్తుందండీ? పైగా ఇది చూడండి. మీరు ఈ హీరోయిన్‌ని పెళ్ళి చేసుకోబోతున్నట్లు వ్రాసారు. నా గొంతు కోసేసారండి మీరు.''

''మన వివాహం కాలేదనడం ఎంత తప్పో, అదీ అంతే తప్పు. సినిమా వాళ్ళమీద అలాంటి వార్తలు మామూలే. అందులో నిజాలు చాలా తక్కువ.''

''మీరు మరీ అంతక్లోజ్‌గా ఏక్ట్ చేయడం బాగుండలేదు'' ''నాకూ బావుండలేదు. యకపోతే హీరో వర్షిప్ ఉండదు. హీరో అనే నా స్థానం నిలబెట్టుకోడానికి నాకు పెళ్ళి కాలేదని అబద్ధమాడకా తప్పలేదు. అలా క్లోజ్‌గా ఆడవాళ్ళతో ఏక్ట్ చేయడమూ తప్పలేదు. ప్రస్తుతం నెంబర్‌వన్ హీరోస్థానంలో ఉన్నాను. మరి దాన్ని భద్రంగా కాపాడుకోవాలి కదా!''

''ఏమండి, ఇప్పటికి సంపాదించింది చాలు. ఇంకా ఈ సినిమాలు మానేయ్యండి. పిల్లల్ని తెచ్చుకొని హాయిగా ఉందాం.''

''తారా మండలానికి వెళుతున్న విమానాన్ని మధ్యలో వెనక్కు తిప్పేయమంటావా? నా వల్లకాదు.''

* * *

దినకర్ దినేష్‌గా మారి ఏడుసంవత్సరాలైంది. ఈ ఏడు సంవత్సరాలలోనూ హీరోగా చాలా పేరు తెచ్చుకున్నాడు. భార్యాబిడ్డల్ని అజ్ఞాతంలోనే ఉంచేసాడు.

ఊటికి షూటింగ్‌కి వచ్చాడు దినకర్.

పిల్లలు అక్కడ ఉన్నారని తెలుసు.

షూటింగ్‌లో మంచి డ్యూయెట్‌లో యాక్టుచేస్తున్నాడు.

ఇంతలో ఎక్కడినుంచో ఇద్దరు పిల్లలు ''డాడీ'' అంటూ పరుగెత్తుకువచ్చారు.

దినకర్‌తో పాటు అందరూ ఆశ్చర్యంగా వారివైపుచూసారు. అందరిముందు వాళ్ళను పిల్లలుగా అంగీకరించక తప్పలేదు. వాళ్ళను రహస్యంగా పంపింది భార్యేనని దినకర్‌కు తెలియదు. తెలిసే అవకాశమూలేదు.

ఆ మర్నాడు పెద్ద అక్షరాలతో పేపర్లో దినకర్ పెళ్ళిసంగతి, పిల్లలసంగతి పడింది.

అంతే కాదు దినకర్‌ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్న హీరోయిన్ మా ఇద్దరిదీ స్నేహం మాత్రమే అని ప్రకటించింది.

ఆ రోజు డైరీలో ఇలా వ్రాసుకుంది రేఖ ''ఇంతకాలానికి నాకు తృప్తిగా ఉంది. ఆయన నటించవలసిన హీరోపాత్ర చేజారిపోయిందని, అంత బాధపడి అబద్ధాలు ఆడితే నిజ జీవితంలోని భార్యపాత్ర, ఆస్థానం జారిపోతుంటే నేనెంత బాధపడాలి? ఎవరి స్థానాలను వాళ్ళు నిలుపుకోవడంలో ఇద్దరం తాపత్రయపడ్డాం. ఆడవాళ్ళు డబ్బుకే విలువనిస్తారు అని మగవాళ్ళు అనుకోవడం ఎంతపొరపాటు? నా మొగుడు నాకే స్వంతం అనుకోవడంలోనే ఆడదానికి ఎనలేని ఆనందం ఉంది. తొంభై శాతం మగాళ్ళు ఆ ఆనందాన్ని భార్యలకు అందనివ్వరు. మగవాడికి బయటి ప్రపంచంలో బోలెడు సమస్యలుంటే భార్యకు భర్తే ఒక పెద్ద సమస్య. భర్త అనే ఆ సమస్యను తెలివిగా ఆకట్టుకుంటూ, ఆటంకాలవరదలకు ఆనకట్టకట్టుకుంటూ! జీవితం నందనవనం చేసుకోవాలి! అని.

*